


# మిడ్‌నైట్ ఛానెల్

## వసంత లాస్యం

బొమ్మిడి అబ్బారావు



''ఏమిటింకాలస్యం?'' భార్య కోసం అప్పటిదాకా ఎదురుచూసి విసిగిపోయిన శ్యామలరావు అడిగాడు.

వసంతలక్ష్మి కొంగుకు చేతులు తుడుచుకుంటూ వచ్చి అలసటగా మంచం మీద వాలిపోయింది.

ఏమిటోయ్, మాట్లాడవు?'' తట్టి అడిగాడు శ్యామలరావు.

''ఏం మాట్లాడమంటారు? మాట్లాడాని క్కూడా ఓపిక మిగిలిందా నాలో? ఇప్పటిదాకా గొడ్డుచాకిరితో నా ఒళ్లు హూనమైపోయింది. ఓ పని మనిషి లేదు, ఓ చాకలి లేదు, కనీసం గ్యాస్ స్టౌ లేక పోయినా కిరోసిన్ స్టౌ కూడా లేదు వంటకు. మాయదారి బొగ్గుల కుంపటితో ఇళ్ళూ ఒళ్ళూ అంతా మసే! చచ్చిపోతున్నాను చాకిరీతో!'' నిస్సహాయత తో ఏడుపు వచ్చినంత పనయ్యింది వసంతలక్ష్మికి.


''ఏం చేస్తాం? మధ్యతరగతి బతుకులు మనవి. వచ్చే జీతం ఇల్లు గడవటానికే సరిపోని గడ్డురోజులు. పని మనుషుల్ని, లాండ్రీ వాళ్లని భరించగల శక్తి మనకు లేదు. గ్యాస్ మనకు గగన కుసుమం. ఎలాగో గడుపుకోవాలి మరి!''

''సర్లెండి... అలాగే గడుపుకొస్తున్నాను కదా! ... ఇంకా నా దగ్గరేముందని నాకోసం అలా నిద్ర మానుకుని పడిగాపులు కాయటం? ... ఒళ్లంతా చెమటతోను, నీటితోను తడిసిపోయింది. గుడ్డలు మెతకవాసనొస్తున్నాయి. ఇలాంటి నాతో మీకు సరస మేంటి? ... ఓ పక్క ఆపుకోలేనంత నిద్ర వస్తోంది. నన్నిలా వదిలేస్తే బతికిపోతాను'' అంటూ అటు తిరిగి పడుకుంది వసంతలక్ష్మి.

''నీ చెమట నాకు సుగంధంతో సమానం. అడ్జస్టయిపోతాను, దానికేం అడ్డులేదుగా!... ఇటు తిరుగు,'' అన్నాడు శ్యామలరావు. కోరికను నిగ్రహించుకోలేని స్థితిలో వున్నాడు.

''మీకేం, భోంచేసి వచ్చి టింగురంగా అంటూ మంచమెక్కేశారు... ఇల్లంతా ఓ కొలిక్కి తీసుకొచ్చేటప్పటికి నా నడుము ముక్కలైపోయింది... నేనిప్పుడు మీకు పనికొచ్చే మూడ్‌లో లేను... ముగ్గురు పిల్లల్ని కనేటప్పటికీ సగం ఓపిక చచ్చిపోయింది. ఈ బండ చాకిరితో తక్కిన సగం ఓపికా చచ్చింది... అబ్బ, వదలండి ... వదలమంటుంటే మీక్కాదూ ... అక్కడ్నుంచి చేతులు తియ్యండి. మీ స్పర్శతో పులకింతలు రేగే స్థితిలో లేను. తియ్యమన్నానా? ...'' కసురుకుంది వసంతలక్ష్మి. శ్యామలరావు ఆమెనొదిలేశాడు.

మరికాసేపటికే వసంతలక్ష్మి గుర్రుపెట్టి నిద్రపోయింది. ఆమె ఎంతగా అలసిపోయిందో అర్థమయ్యిందతనికి.




శ్యామలరావుకి నిద్రపట్టడం లేదు. లేచి వరాండాలోకి వచ్చాడు. సిగరెట్ తీసి వెలిగించాడు. పొగ వదుల్తూ ఆలోచనల్లోకి జారిపోయాడు.

ఈమధ్య వసంతకి చిరాకులు పరాకులు ఎక్కువైపోయాయి. అసలు సెక్స్‌పట్ల ఏమాత్రం ఆసక్తి కనపరచటం లేదు. పనితో సతమతమై పోతున్నమాట నిజమే! అంతమాత్రాన 'ఆ' విషయానికొచ్చే సరికి ఎందుకంత విముఖత్వం చూపిస్తోంది? ఆమెకు నిండా ముప్పయ్యేళ్లు లేవు. ఆనందంగా అనుభవించాల్సిన వయసు. అఫ్‌కోర్స్, ముగ్గురు పిల్లలు పుట్టినంత మాత్రాన అందుకభ్యంతరమేముంది? ఇంకా, అభ్యంతరమంటూ వుంటే అది తనకుండాలి- ముగ్గురు బిడ్డల తల్లితో సంసారం చెయ్యటానికి! కాని, తనకదేం లేదసలు.

ఏమాట కామాటే చెప్పుకోవాలి, ముగ్గురు బిడ్డలకు జన్మనిచ్చినా వసంత ఇప్పటికీ కన్నెపిల్ల లాగానే కనిపిస్తుంది తన కళ్లకి! ఆ బిగువు బింకం ఇప్పటికీ సడలలేదు సరికదా, ఇదివరకటికన్న ఒళ్లు చేసి ఆరోగ్యంగా అందంగా నిండుగా కనిపిస్తోంది. ఆమెతో తను ఏనాడూ అసంతృప్తి చెందలేదు. ఆమె పొందుకోసం ప్రతి రోజూ తను తహతహలాడుతూనే వున్నాడు.

కాని... కాని.. వసంతలో ఎందుకీ మార్పు వచ్చింది? ఆమెకు తనపట్ల ఇష్టం, ప్రేమ తగ్గిపోతున్నాయా? ఆమెకు తనంటే మొహం మొత్తుతోందా?.. ఛ ఛ, తను చాలా దారుణంగా ఆలోచిస్తున్నాడు. వసంతకు తనంటే వల్లమాలిన ప్రేమ. తనకి తలనొప్పి వచ్చినా విలవిల్లాడిపోతుంది. తనకే వచ్చినట్లుగా హడావిడి చేస్తుంది. ఆమె గురించి చెడుగా ఒక్కమాట కూడా అనుకోవటానికి లేదు. ఆమె మనసులో ఇంకేదో కారణం సంక్లిష్టమై వుండి వుండాలి! తనామెను లాలించి ఆ విషయం రాబట్టాలి!

ఒకవేళ... నిజంగానే ఇంటిపనితోను, చాకిరితోను అలసిసొలసి నిద్రకు పడిపోతున్నదేమో! నిద్రకన్న సుఖమేమున్నది గనక!? హాయిగా నిద్రపోగలిగిన వాళ్లు ఈలోకంలో అందరికన్న అదృష్టవంతులు! తనకి రమ్మన్నా నిద్రరావటం లేదు; ఆమె ఒళ్లెరక్కుండా నిద్రపోతోంది.

సిగరెట్టు చివరంటా కాలిపోయి వేలు చురుక్కుమనగానే ఆలోచనల్లోంచి తేరుకుని సిగరెట్ పీక అవతల పారేసి లోపలికొచ్చి పక్కమీద వాలాడు.

వసంతలక్ష్మి గాఢ సుషుప్తిలో వుంది!

★ ★ ★

''నీ ప్రాబ్లెం నాకు పెద్ద ప్రాబ్లెంగా కనిపించటం లేదురా శ్యామూ... ఆమెకు పూర్తిగా విశ్రాంతి లేక పోవటమే ఆమెకు సెక్స్‌పట్ల ఆసక్తి తగ్గిపోవటానికి కారణమై వుంటుందనుకుంటున్నాను ...'' అన్నాడు కామేశ్వరరావు.

శ్యామలరావు అతనివంక దీనంగా చూశాడు.

''అంతేనంటావా? విశ్రాంతి లేకపోయినంత మాత్రాన సెక్స్‌పట్ల కోరిక ఎక్కడికి పోతుందిరా!? ఆహార నిద్రా మైధునాలు ప్రాణికి సహజలక్షణాలు కదా! తిండి, నిద్ర ఎలాగో ఈ కోరికా అలాంటిదే కదా!'' అన్నాడు అమాయకంగా.

''నువ్వు లాజికల్‌గా ఆలోచించు, నీకే అర్థమవుతుంది. ఆకలితో వున్నవాడు ఏం తింటున్నదీ, రుచిగా వున్నది లేనిది ఏమీ గుర్తించలేడు- తినటం మీదనే దృష్టినంతా కేంద్రీకరిస్తాడు. రోజంతా శ్రమపడిన కష్టజీవి రాత్రయ్యేసరికి ఏదో ఇంత తిని హాయిగా గుర్రుపెట్టి నిద్రపోవటంలోనే ఆనందం పొందుతాడు. అతనికి నిద్రపట్ల వున్న ఆసక్తి ఇక దేనిమీదా వుండదు.

నీ భార్య తన శక్తికి మించిన పనితో సతమతమైపోతూ రాత్రయ్యేసరికి ఒళ్లెరక్కుండా నిద్రపోతోంది. అదే, పనిభారం తగ్గిందనుకో- అప్పుడు కాస్త తీరిక వెసులుబాటు దొరుకుతాయి. దాంతో తక్కిన విషయాల మీద, నీమీద, సెక్స్‌మీద ఆటోమాటిగ్గా శ్రద్ధ పుడుతుంది. అప్పుడు, నువ్వు బద్ధకించినా నిన్నులేపి మరీ తన కోరిక తీర్చమని కూచుంటుంది... నవ్వకు, సీరియస్‌గా చెపుతున్నాను. స్త్రీకి కోరిక పుట్టాలేగాని, ఎలాగైనా దాన్ని తీర్చుకుని తీర్తుంది, తన భర్తతో!'' గుక్క తిప్పుకోవటానికన్నట్లు కొద్ది క్షణాలు ఆగాడు కామేశ్వరరావు.

''అయితే ఇప్పుడు నన్నేం చెయ్యమంటావు?'' అయోమయంగా అడిగాడు శ్యామలరావు.

''ఇంత చెప్పినా అర్థం చేసుకోలేకపోతే, నేనేం చేసేది?''

''వద్దు వద్దు, తలగోడకేసి బాదుకోకురా కాముడూ, దెబ్బ తగుల్తుందేమో!'' జాలిపడ్డాడు శ్యామలరావు.

''పోనియ్‌రా, నీలాంటి స్నేహితుడ్ని పొందిన పాపానికి నా తల పగిలిపోవాల్సిందే!...'' కామేశ్వరరావు వైరాగ్యంలో పడిపోయాడు.

''ఒకే బాస్! ముందు మా ఆవిడకు పనిభారం తగ్గించమంటావు- అలాగే! పనిమనిషిని పెట్టుకుని దాని గొంతెమ్మ కోరికలు తీర్చే స్తోమత లేదుగాని, మా ఆవిడ పని సగం నేను పంచుకుంటాను... బొగ్గుల కుంపటి బదులు కనీసం కిరోసిన్ స్టవ్ తీసుకుంటాను... దీపం పథకం మనకు వర్తించదు గాని, గ్యాస్‌స్టవ్ తీసుకుని వుండేవాణ్ణి! డబ్బు పొదుపు చేసి గ్యాస్‌కనెక్షన్ తీసుకుంటాను... అంతెందుకు, మా ఆవిడ అలసి సొలసి పోకుండా చూసుకుంటాను, సరేనా?''

''గుడ్, నా బెస్ట్‌ఫ్రెండ్ ననిపించావురా శ్యామూ! ఇప్పుడు నువ్వు నాకెంత ముద్దొస్తున్నావో తెలుసా!?'' లేచి శ్యామలరావు దగ్గరగా వచ్చాడు కామేశ్వరరావు.

''కొంప తీసి ముద్దెట్టేసుకుంటావేంటి? ... ఇప్పుడు నేను ముద్దు రావాల్సింది మా ఆవిడకు- నీక్కాదు!'' లేచి స్నేహితుడికి ధన్యవాదాలు చెప్పి,

హుషారుగా బయలుదేరాడు శ్యామలరావు.

★ ★ ★

''ఏమిటి దేవీ, నా కళ్లు నిన్ను మోసం చెయ్యటం లేదు కదా! ఎంత ముగ్ధమనోహరంగా తయారయ్యావీరోజు! నా జన్మ తరించింది సుమా! భార్యకు ఎదురేగి, ఆమెను పొదివి పట్టుకుని మంచంవైపు నడిపించాడు శ్యామలరావు.

వసంతలక్ష్మి సిగ్గుపడుతూ, ''పోదురూ బడాయి! నేనెప్పుడూ మీ వసంతనే! కాకపోతే ఈ మధ్య పనిభారం ఎక్కువై మీపట్ల నా ధర్మాన్ని నిర్వర్తించలేక పోయానంతే! ఇప్పుడు నా కష్టాన్ని మీరూ పంచుకుంటున్నారు. ఆ వెధవ కుంపటి బాధ తప్పిపోయాక నాకెంత టైం మిగుల్తుందో, ఎంత సుఖంగా వుందో చెప్పలేను... ఎలాగో గ్యాస్ కనెక్షన్ తీసేసుకుంటే...'' అన్నది భర్తవంక అలవోకగా చూస్తూ.

''తప్పకుండా తీసుకుందాం... మా ఫ్రెండు గ్యాస్ ఏజెన్సీ తీసుకున్నాడు. వచ్చే రెండుమూడు నెలల్లో మనకి గ్యాస్ కనెక్షన్ ఇస్తానన్నాడు...'' అంటూ భార్యను పక్క మీదకు లాగాడు శ్యామలరావు.


వసంతలక్ష్మి శుభ్రంగా స్నానంచేసి కాస్మెటిక్స్ పరిమళాలతో గుభాళిస్తోంది. ఆమె జడలోసన్న జాజులు సంపెంగలు మత్తుగా నవ్వుతున్నాయి. శుభ్రమైన చీర కట్టుకుని ఉన్నంతలో చక్కగా అలంకరించుకుని శ్యామలరావు కంటికి అపర రతీదేవిలా కనిపిస్తోంది.

శ్యామలరావు ఆమెను బలంగా గుండెలకు హత్తుకుని, ఆమె శరీరంలోని ప్రత్యణువును ముద్దులతో ముంచెత్తివేస్తున్నాడు. కిల కిల నవ్వుతూ చక్కిలిగింతలతో మెలికలు తిరుగుతోందామె.

''అబ్బ! ముగ్గురు పిల్లల తల్లివంటే నేను నమ్మలేకపోతున్నాను సుమా! కన్నెపిల్లకున్నంత బిగువు బింకం నీ సొంతం. అందుకే ఎంతటి అందగత్తె నాకు తారసపడినా నా మనసు చెక్కు చెదరడం లేదు. నువ్వు నాకు దూరంగా వుంటున్న ఈ మధ్య కాలంలో ... చెప్పొద్దు, బయట తిరుగుళ్ల వైపు మనసు లాగింది గానీ... అమాయకమైన అందమైన నీ ముఖమే నా కళ్లముందు మెదిలి, నా మనసంతా నువ్వే ఆక్రమించుకున్నావు... దాంతో నాకెక్కడలేని నిగ్రహమూ వచ్చేసి అమ్మాయిల వంక చూడటమే మానేశాను.''

''మీ మాటల్ని బట్టే చూస్తుంటే మీరేదో గ్రంథం నడిపారనే సందేహం వస్తోంది నాకు!... ఎక్కడైనా తిరిగారా?''

''బాబోయ్, నేరకపోయి చెప్పాను నీ దగ్గర...




నువ్వు నా మనసు నెంతగా ఆకట్టుకున్నావంటే, మరో ఆడదాని గురించే ఆలోచించబుద్ధి కాదు.. అందుకే, నన్నెప్పుడూ ఉపాసం పెట్టకు వసూ!'' ఆమెను కౌగిట్లో నలిపేస్తూ అన్నాడు శ్యామలరావు.

''నాకు మీరెలాంటివారో తెలీదు గనకనా! మీకు నామీదెంత పిచ్చిప్రేమో అంతకు రెట్టింపు ప్రేమ మీరంటే! కాని ఈమధ్య నిజంగానే పనిభారంతో ఏడుపొచ్చేది. మిమ్మల్ని సుఖపెట్టలేక పోతున్నానని నాకు తెలుసు. అయినా అలసిపోయి పిచ్చిగా నిద్రపోయేదాన్ని ... ఇప్పుడు నాకు అన్ని పనుల్లోనూ సహకరిస్తుంటే, నాకు తీరిక దొరుకుతోంది. అలంకరణ మీద ఆసక్తి మీతో సరదాగా గడపాలన్న కోరిక బలంగా పుట్టుకొస్తున్నాయి'' భర్త గుండెలమీద తలవాల్చి చెప్పింది వసంతలక్ష్మి.

ఆమె పెదాల్ని బలంగా తన పెదాలతో ఒత్తుతూ,

''ఇప్పటికే చాలా అమూల్యమైన రాత్రుల్ని వ్యర్థం చేసుకున్నాం. ఇప్పుడు మాటలతో మరింత వేస్ట్ చేసుకోకూడదు. బుద్ధిగా మన పనిలో మునిగిపోదాం'' అంటూ పక్కమీద దొర్లించాడామెను.

ఆమె కిలకిలనవ్వింది.

''కష్టపడి అలంకరించుకున్నావు. మంచి చీర కట్టుకున్నావు. నలిగిపోతుందేమో, తీసెయ్యకూడదూ?'' ఆమె యవ్వన శిఖరాల వైపు చూస్తూ అన్నాడు శ్యామలరావు.

''ఓ పక్క లేవకుండా నన్నదీ మీరూ పట్టుకుంటూ నన్ను చీర విప్పమంటారేం? అబ్బ ఎంత జాణతనం! నేనిక లేవలేనుగాని ఆ పనేదో మీరే చేసుకోకూడదూ....!'' క్రీగంట భర్తవైపు శృంగార చెణుకు విసిరింది వసంతలక్ష్మి. అప్పటికే అతని చర్యలకు ప్రతిస్పందిస్తూ అతని వేతిలో మైనం ముద్దలా అయిపోయిన వసంత కళ్లు అరమోడ్పులయ్యాయి.

''ఉహూ, నీకు మాటలు రాలేవనుకున్నా నిన్నాళ్లు! సరే అలాగే, నేనైతే చీర ఒక్కదానితో సరిపెట్టాను మరి!... మన శరీరాల మధ్య అడ్డుగా వున్న ఈ బట్టలంటే నాకు చాలాకోపం...'' కొంటెగా నవ్వాడు శ్యామలరావు సీరియస్‌గా తనపని చేసుకుపోతూ.

అనాచ్ఛాదితమైన తన శరీరాన్ని అదే పరిస్థితిలో వున్న భర్త శరీరంతో బలంగా పెనవేసుకుపోతూ ''అబ్బ, దీపం తీసేద్దురూ... సిగ్గుతో చచ్చిపోతున్నాను ...'' అన్నది.

ఆ భార్యాభర్తలిద్దరికీ అది ప్రథమ సమాగమంలా వుంది. ఒకరి కోరికల్ని మరొకరు మన్నించుకుంటూ, ఒకరినొకరు సహకరించుకుంటూ మన్మథ సామ్రాజ్యాన్ని నిరంకుశంగా ఏలుతున్నారు.